3 నెలలు అమెరికాను వీడితే

పౌరసత్వం గల్లంతు

- భారతీయ వృద్ధులను లక్ష్యంగా చేసుకుంటున్న ట్రంప్ సర్కారు
- శీతాకాలంలో భారత్ వచ్చి తిరిగి వెళ్తున్న వారికి ఇక్కట్లు

వాషింగ్టన్: అమెరికాలోని ప్రవాస భారతీయులు లక్ష్యంగా ట్రంప్ యంత్రాంగం మరింత నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. ముఖ్యంగా శాశ్వత పౌరసత్వానికి ఆధారమైన గ్రీన్‌కార్డున్న భారతీయ వృద్ధులను విమానాశ్రయాలలో బెదిరింపులకు గురిచేస్తున్నది. వారి గ్రీన్‌కార్డులను స్వాధీనం చేయాలని, పౌరసత్వం వదులుకుంటున్నట్టు ఐ-407 ఫారంపై సంతకం చేయాలని ఒత్తిళ్లకు గురిచేస్తున్న ఘటనలు ఇటీవలి కాలంలో పెరుగుతున్నట్టు తెలుస్తున్నది. శీతాకాలంలో పలువురు ప్రవాస భారతీయులు అక్కడి వాతావరణాన్ని తట్టుకోలేక స్వదేశం వస్తుంటారు. మూడు నెలలు ఇక్కడ గడిపి తిరిగి వెళ్తున్న వృద్ధులను విమానాశ్రయాలలో కస్టమ్స్, బార్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) అధికారులు నిర్బంధిస్తున్నారు. అమెరికా ఇమ్మిగ్రేషన్, నేషనాలిటీ చట్టం (ఐఎన్ఏ) ప్రకారం ఆ దేశ పౌరులు 180 రోజులు దేశం వీడి తిరిగి వస్తే, వారిని పునఃప్రవేశం కోరుతున్నట్టుగా భావిస్తారు. వారికి ప్రవేశాన్ని నిరాకరించే అవకాశం కూడా ఉంది. అయితే గ్రీన్‌కార్డు ఉన్న వారు ఏడాది కన్నా ఎక్కువ కాలం అమెరికాకు వెలుపల ఉంటేనే ఈ చట్టం వర్తిస్తుందని ఫ్లోరిడాకు చెందిన ప్రవాస భారతీయ న్యాయవాది అశ్విన్ శర్మ చెప్పారు. అయితే ఏడాదికన్నా తక్కువ కాలం దేశం విడిచి వెళ్లిన ఎన్నారైల గ్రీన్‌కార్డులను రద్దు చేయడం ఇటీవలి కాలంలో పెరిగిపోయిందని ఆయన వెల్లడించారు. ముఖ్యంగా భారతీయ వృద్ధులను సీబీపీ టార్గెట్ చేస్తున్నదని తెలిపారు. గ్రీన్‌కార్డులను స్వాధీనం చేయని వారిని నిర్బంధిస్తామని లేదా స్వదేశానికి తిరిగి పంపుతామని బెదిరిస్తున్నారని చెప్పారు. సీబీపీ సిబ్బందికి ట్రంప్ ప్రభుత్వం న్యాయమూర్తిగా, న్యాయవ్యవస్థగా, చట్టాన్ని అమలుచేసే సంస్థగా అధికారాలు కల్పించిందని అన్నారు. గ్రీన్‌కార్డు ఉన్నవారు ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని అధికారులకు స్వాధీనం చేయకూడదని సియాటిల్‌కు చెందిన మరో న్యాయవాది కృపా ఉపాధ్యాయ్ సూచించారు. ఎవరైనా స్వచ్ఛందంగా తమ గ్రీన్‌కార్డును స్వాధీనం చేసి, ఐ-407 పత్రంపై సంతకం చేస్తే తప్ప వారి సభ్యత్వం రద్దు కాదని చెప్పారు. అలాగే ఏడాది కన్నా అధికంగా అమెరికా వెలుపల గడిపిన వారు తమ నివాసాన్ని వదులుకున్నట్టు భావిస్తారని తెలిపారు. అయితే ఇలాంటి వారు తమ నివాస హక్కు కోసం కోర్టును ఆశ్రయించవచ్చన్నారు.

జూన్ 15న నీట్ పీజీ-2025

- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్‌బీఈఎంఎస్
- వెరిఫికేషన్, లాగిన్ కోసం పరీక్ష హాల్‌కు అభ్యర్థులు ముందుగా రావాలని సూచన

న్యూఢిల్లీ: నీట్ పీజీ-2025 జూన్ 15న నిర్వహిస్తున్నట్టు 'నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్' (ఎన్‌బీఈఎంఎస్) ప్రకటించింది. ఈమేరకు మంగళవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. నిర్దేశిత టైమ్ టేబుల్ ప్రకారం రెండు షిఫ్ట్‌ల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నది. మొదటి షిఫ్ట్ ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 3.30 నుంచి 7 గంటల వరకు ఉంటుందని, ఇతర ముఖ్యమైన సమాచారం, మరిన్ని వివరాలతో కూడిన పూర్తి షెడ్యూల్‌ను 'ఎన్‌బీఈఎంఎస్' వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు అధికారులు తెలిపారు. అభ్యర్థులు జూలై 31కల్లా ఇంటర్న్‌షిప్ పూర్తిచేసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. బయోమెట్రిక్ వెరిఫికేషన్, కంప్యూటర్ లాగిన్ ప్రక్రియలను పూర్తిచేసేందుకు అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి షెడ్యూల్ కన్నా ముందే చేరుకోవాలని సూచించింది. నీట్ పీజీ-2025 పరీక్ష ద్వారా ఎంఎస్ కోర్సులో 12,690, ఎండీ కోర్సులోని 24,360, పీజీ డిప్లొమా కోర్సులోని 922 సీట్లను భర్తీ చేయనున్నారు.

కాంగ్రెస్ గ్యారెంటీలతో

ఆర్థిక సంక్షోభమే

- ఉచిత హామీల కోసం అడ్డగోలుగా అప్పులు
- కాంగ్రెస్ సర్కారు విధానాలతో కర్ణాటక నాశనం
- ఉద్యోగాలు లేవు.. అభివృద్ధి పనులు అసలే లేవు
- దిద్దుబాటు చర్యలు లేకుంటే చివరకు దివాలానే
- ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ హెచ్చరిక
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పుల వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో స్పందన

బెంగళూరు, మార్చి 17/(స్పెషల్ టాస్క్ బ్యూరో): గ్యారెంటీల ఆశ చూపించి మూడు రాష్ట్రాల్లో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఆ రాష్ట్రాలను అప్పుల ఊబిలో ముంచుతున్నది. హస్తం పార్టీ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్ ఇప్పటికే దివాలా అంచుకు చేరుకోగా తాజాగా ఈ జాబితాలో కర్ణాటక, తెలంగాణ కూడా చేరాయి. కర్ణాటకలో సిద్ధరామయ్య సర్కారు గ్యారెంటీల అమలు కోసమంటూ ఎడాపెడా చేస్తున్న అప్పులు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తాజాగా అప్పులపై చేసిన వ్యాఖ్యలే దీనికి నిదర్శనం. కాగా ఐదు గ్యారెంటీల పేరిట తీసుకొచ్చిన ఉచిత పథకాలను కొనసాగించడం కోసం కర్ణాటకలోని సిద్ధరామయ్య ప్రభుత్వం అప్పుల మీద అప్పులు చేస్తుండటంపై ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ పాయ్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను 'ఎక్స్' వేదికగా తూర్పారబట్టారు.

రేవంత్ వ్యాఖ్యలతో బీజం

తెలంగాణ ఆర్థిక స్థితి బలహీనంగా ఉన్నదని, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. డీఏ చెల్లింపులపై పట్టుబట్టవద్దంటూ ఉద్యోగులకు విజ్ఞప్తి చేసిన ఆయన.. ఉద్యోగులకు జీతాలు చెల్లించడం కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నుంచి రూ.4 వేల కోట్లను చేబదులుగా రుణం తీసుకున్నట్టు వెల్లడించారు. రేవంత్ వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో పెద్దయెత్తున చర్చకు దారితీశాయి. కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ఆర్థిక సంక్షోభంలోకి చేరిందంటూ పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీన్ని ఉటంకిస్తూ జాతీయ మీడియా 'టైమ్స్ నౌ' ఓ ప్రత్యేక కథనాన్ని ప్రసారం చేసింది. తెలంగాణ అప్పులు, ఉద్యోగుల వేతనాలు, డీఏ తదితరాలపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను విశ్లేషిస్తూ.. హిమాచల్ తరహాలోనే తెలంగాణ కూడా ఆర్థిక సంక్షోభం దిశగా వెళ్తున్నట్టు అభిప్రాయపడింది.

రాష్ట్రం నాశనమే

ఈ క్రమంలో అప్పుల గురించి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఉటంకిస్తూ ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ పాయ్ కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ తీరును 'ఎక్స్' వేదికగా ఎండగట్టారు. ఉద్యోగులకు జీతాలు చెల్లించలేక రూ.4 వేల కోట్లు ఆర్‌బీఐ నుంచి రుణం తీసుకున్న సంగతిని సీఎం రేవంత్ రెడ్డి బయటపెట్టారని, ఇదే విధంగా భారీగా అప్పులు చేస్తున్న కర్ణాటక కూడా సంక్షోభంలోకి కూరుకుపోతుందని హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఎక్స్‌లో సుదీర్ఘంగా ఓ పోస్ట్ పెట్టారు. 'సిద్ధరామయ్య నేతృత్వంలోని కర్ణాటక కాంగ్రెస్ సర్కారు విధానాలు కర్ణాటక భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు రూ. 21,000 కోట్లకు పైగా నమోదవ్వగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ ఇది రూ. 19 వేల కోట్లకు పైగా ఉన్నది. ఉచిత హామీల అమలు కోసమని పెద్దయెత్తున అప్పులు చేస్తున్నారు. గ్యారెంటీల కోసం పన్నుల వాతకు తెగబడుతున్నారు. ఇది పన్ను చెల్లింపుదారులకు శరాఘాతంలా మారుతున్నది. దీంతో ఉత్పాదకత మందగిస్తున్నది. ఉచిత పథకాలు పేదవారి కోసం ఉద్దేశించినవి తప్ప రాష్ట్రంలోని 60 శాతం జనాభా మొత్తానికి కాదు. గ్యారెంటీ పథకాలు అనర్హులకు కూడా అందుతున్నాయి. అలా జరుగకుండా చూడాల్సిన అవసరమున్నది. ట్రాఫిక్ సమస్య, అస్తవ్యస్తమైన రోడ్లు, గుంతలు, చెత్తతో బెంగళూరు తన మునుపటి ప్రభను కోల్పోతున్నది. ఇలాంటి సమయంలో ఆర్థిక, సంక్షేమ పథకాలపై ప్రభుత్వ పెద్దలు పునరాలోచించాల్సిన అవసరం ఉన్నది. ఉచితాల కోసం వెచ్చిస్తున్న మొత్తాన్ని తగ్గించి ఆ నిధులను ఉపాధి, మౌలిక వసతుల కల్పనకు వెచ్చించాల్సిన సమయం వచ్చింది. మరో రెండు బడ్జెట్లు ప్రవేశపెట్టే నాటికి ప్రస్తుత ప్రభుత్వ కాలపరిమితి ముగుస్తుంది. ఒకవేళ, ఉచితాల పేరిట అప్పులు ఇలాగే కొనసాగితే కర్ణాటక నాశనమవ్వడం ఖాయం. ఇది జరుగకుండా ఉండాలంటే వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలి' అంటూ పాయ్ హెచ్చరించారు.

హిమాచల్‌లో పాల ధరపై బాదుడు

కర్ణాటకలాగే హిమాచల్‌ప్రదేశ్‌లోనూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆపసోపాలు పడుతున్నది. గ్యారెంటీల అమలుకు అవసరమైన నిధుల సేకరణకు చివరకు ప్రజలపై ధరల భారం మోపుతున్నది. ఇప్పటికే వివిధ రకాల చార్జీలు పెంచిన సుఖ్‌విందర్ సుఖు ప్రభుత్వం తాజాగా రాష్ట్రంలో లీటర్ పాల ధరను ఏకంగా రూ.6 పెంచుతున్నట్టు తెలిపింది. ఈ మేరకు సోమవారం శాసనసభలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ముఖ్యమంత్రి సుఖు ఈ విషయాన్ని వెల్లడించారు. దీంతో లీటరు ఆవు పాల ధర రూ.51కి, గేదె పాల ధర రూ.61కి చేరుకోనుంది. ఇప్పటికే నిత్యావసరాల ధరల పెరుగుదలతో కుదేలైన పేద, మధ్య తరగతి ప్రజలపై తాజా పెంపు మరో అదనపు భారంగా మారిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వక్ఫ్ బిల్లుపై ఢిల్లీలో ధర్నా

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఏఐఎంపీఎల్‌బీ) సోమవారం న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ధర్నా నిర్వహించింది. పలువురు ఎంపీలు, ముస్లిం సంస్థలు ఈ నిరసనలో పాల్గొన్నాయి. ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ ఒవైసీ మాట్లాడుతూ, ఎన్డీయేలోని టీడీపీ, జేడీయూ, ఎల్‌జేపీ (రామ్‌విలాస్) పార్టీలను హెచ్చరించారు. మందిరం-మసీదు పేరుతో నిరంతరం ప్రజలు పోట్లాడుకోవాలనేది మోదీ ఉద్దేశమని మండిపడ్డారు.

2 నెలలకుపైగా 'డిజిటల్ అరెస్టు'

- ముంబై వృద్ధురాలి నుంచి ఏకంగా రూ.20.25 కోట్లు కాజేసిన కేటుగాళ్లు

ముంబై: సైబర్ మోసాల్లో దిగ్భ్రాంతికరమైన ఓ ఘటన వెలుగులోకి వచ్చింది. 'డిజిటల్ అరెస్టు' స్కామ్‌లో ఓ ముంబై వృద్ధురాలు (86) ఏకంగా రూ.20.25 కోట్లు నష్టపోయారు. నిరుడు డిసెంబర్ 26 నుంచి ఈ ఏడాది మార్చి 3 వరకు జరిగిన ఈ మోసం భారత్‌లో సుదీర్ఘ కాలంపాటు కొనసాగిన 'డిజిటల్ అరెస్టు' కుంభకోణాల్లో ఒకటిగా నిలిచింది. పోలీస్ అధికారులమని చెప్పుకుంటూ కొందరు సైబర్ కేటుగాళ్లు ఆ వృద్ధురాలికి ఫోన్ చేశారు. ఆమె ఆధార్ కార్డు దుర్వినియోగమైందని, దాని సాయంతో బ్యాంకు ఖాతా తెరిచి మనీ లాండరింగ్ సహా పలు ఇతర అక్రమ కార్యకలాపాలను నిర్వహించినందుకు కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నామని బెదిరించారు. నేరానికి పాల్పడినట్టు అంగీకరించకపోతే ఆమె కుటుంబాన్ని సైతం కేసులో చేర్చుతామని భయపెట్టారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం..

ముగ్గురు తెలంగాణవాసుల మృతి

- రాంగ్‌రూట్‌లో వచ్చి కారును ఢీకొన్న ట్రక్కు
- టేకులపల్లికి చెందిన ప్రగతిరెడ్డి, ఆమె కుమారుడు,అత్త దుర్మరణం

షాద్‌నగర్/కొందుర్గు: అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తెలంగాణవాసులు మృత్యువాత పడ్డారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలంలోని టేకులపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పవిత్రాదేవి చిన్న కుమార్తె ప్రగతిరెడ్డి(35)కి సిద్దిపేట సమీపంలోని బక్రిచెప్రియాల్ గ్రామానికి చెందిన రోహిత్‌రెడ్డితో 2016లో వివాహమైంది. ఎమ్మెస్సీ పూర్తి చేసిన ప్రగతి ఉన్నత చదువుల కోసం 2012లో అమెరికాకు వెళ్లారు. భార్యాభర్తలిద్దరు ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. ఈ నెల 16న తెల్లవారుజామున 3 గంటలకు ప్రగతిరెడ్డి కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న కారును.. రాంగ్‌రూట్‌లో వచ్చిన ట్రక్కు ఢీకొన్నదని, ఈ ప్రమాదంలో ప్రగతిరెడ్డితోపాటు ఆమె పెద్ద కుమారుడు అర్విన్(6), అత్త సునీత(56) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందటంతో టేకులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల దహన సంస్కారాలు అమెరికాలోని ఫ్లోరిడాలో జరుపుతామని కుటుంబ సభ్యులు తెలిపారు.

మాజీ మంత్రి కేటీఆర్ సంతాపం

అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ వాసుల మృతిపట్ల మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం ట్విట్టర్‌లో సంతాపం ప్రకటించారు. ఈ దుఃఖ సమయంలో దేవుడు వారికి ధైర్యాన్ని, శక్తిని ప్రసాదించాలని కోరుకుంటున్నానని, మృతుల ఆత్మకు శాంతి కలగాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. గాయపడిన రోహిత్‌రెడ్డితోపాటు అతని చిన్న కుమారుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సేకరించిన భూమిని వినియోగించకపోతే తిరిగి రైతుకే

- జాతీయ రహదారుల చట్టానికి త్వరలో సవరణ
- డీనోటిఫికేషన్‌తో భూ యజమానులకు ప్రయోజనం

న్యూఢిల్లీ: జాతీయ రహదారుల అభివృద్ధి కోసం సేకరించిన భూమిని ఐదేళ్లపాటు వినియోగించకపోతే, దానిని తిరిగి యజమానికి ఇచ్చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నది. ఉన్నతాధికారి ఒకరు తెలిపిన వివరాల ప్రకారం, జాతీయ రహదారుల చట్టాన్ని ప్రభుత్వం సవరించబోతున్నది. ఈ చట్టం ప్రకారం భూమిని సేకరించినపుడు, దానిని వినియోగించకపోతే, డీనోటిఫై చేయడానికి తగిన నిబంధన లేదు. అందుకే దీనిని సవరించి, డీనోటిఫై చేయడానికి ఓ నిబంధనను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ సవరణ కేంద్ర మంత్రివర్గానికి, ఆ తర్వాత పార్లమెంటుకు వెళ్లబోతున్నది. జాతీయ రహదారుల కోసం భూ సేకరణను వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ సవరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జీన్ థెరపీతో బ్లడ్ క్యాన్సర్‌కు చెక్

ముంబై పరిశోధకుల అభివృద్ధి



ఢిల్లీ, మార్చి 17: ముంబైకి చెందిన పరిశోధకులు బ్లడ్ క్యాన్సర్‌కు సరికొత్త చికిత్సను కనుగొన్నారు. బ్లడ్ క్యాన్సర్‌కు చెక్ పెట్టేందుకు జీన్ థెరపీని అభివృద్ధి చేశారు. సీఏఆర్ టీ-సెల్ థెరపీగా పిలుస్తున్న దీని ద్వారా భారతీయులపై క్లినికల్ పరీక్షలు నిర్వహించగా.. 73 శాతం రోగుల్లో ఇది సమర్థంగా పనిచేస్తున్నట్టు తేలింది. ఈ మేరకు లాన్సెట్ హెమటాలజీ జర్నల్‌లో కథనం ప్రచురితమైంది. సీఏఆర్ టీ- సెల్ థెరపీ అనేది టీ సెల్స్‌ను మోడిఫైడ్ చేయడం ద్వారా పని చేస్తుంది. టీ సెల్స్ అనేవి ఒక రకమైన రోగనిరోధక కణాలు. ఇవి క్యాన్సర్‌పై పోరాడేందుకు సహకరిస్తాయి. ముంబైకి చెందిన టాటా మెమోరియల్ హాస్పిటల్, ఐఐటీ-బాంబే సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఈ అధ్యయనం ముఖ్యంగా లుకేమియా, లింపోమా క్యాన్సర్లపై దృష్టి పెడుతుంది. రిలాప్స్ (ఒకానొక దశలో వ్యాధి తగ్గినట్టే తగ్గి మళ్లీ బీ-సెల్స్‌పై కణతులు పెరగడం), రెఫ్రెక్టరీ (ఔషధాలకు స్పందించని స్థితి) కారణంగా తక్కువ ఆదాయ దేశాల్లో చాలామంది రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పరిశోధకులు వీటిపై దృష్టిసారించారు.

చాలా తక్కువ వ్యయం...

11 ఏండ్ల పాటు జరిగిన అధ్యయనంలో భాగంగా పరిశోధకులు టాలికాబ్జజీన్ ఆటోల్యూసెల్ ఇంజెక్షన్‌ను అభివృద్ధి చేశారు. ల్యాబ్ పరీక్షలు, జంతువులపై టెస్టులు విజయవంతమయ్యాక, ఇప్పుడు తాజాగా క్లినికల్ ట్రయల్స్ చేపట్టారు. ట్రయల్స్‌లో భాగంగా మొదటి దశలో బీ-సెల్ లింపోమాతో బాధపడుతున్న 18 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న 14 మందికి ఈ ఇంజెక్షన్ ఇచ్చి పరీక్షించారు. రెండో దశలో భాగంగా బీ-సెల్ లుకేమియాతో బాధపడుతున్న 15 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న 50 మందిపై పరీక్షించారు. వీరి సగటు వయసు 44. వీరిలో 49 మంది పురుషులు, 15 మంది మహిళలు ఉన్నారు. వారిపై ఔషధ పనితీరును విశ్లేషించగా.. 73 శాతం ప్రతిస్పందన రేటు కనిపించింది. ఈ చికిత్స క్యాన్సర్ రోగులకు పునర్జన్మ లాంటిదని, ఇతర దేశాల్లో ఉన్న చికిత్సలతో పోలిస్తే దీని వ్యయం చాలా తక్కువని పరిశోధకులు తెలిపారు.

45% మంది ఎమ్మెల్యేలపై

క్రిమినల్ కేసులు

అత్యధికంగా బీజేపీ నుంచి 638 మంది ఎమ్మెల్యేలు: ఏడీఆర్

దేశంలోని మొత్తం ఎమ్మెల్యేల్లో 45 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) తాజా నివేదిక వెల్లడించింది. 28 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 4,123 మంది ఎమ్మెల్యేలలో 4,092 మంది అఫిడవిట్లను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించింది.

ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు

రాష్ట్రం	ఎమ్మెల్యేల శాతం
ఆంధ్రప్రదేశ్	79%
కేరళ	69%
తెలంగాణ	69%
బీహార్	66%
మహారాష్ట్ర	65%
తమిళనాడు	59%

క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు పార్టీలవారీగా

పార్టీ	మొత్తం ఎమ్మెల్యేలు	క్రిమినల్ కేసులున్న వారు
బీజేపీ	1,653	638
కాంగ్రెస్	646	339
టీడీపీ	134	115
డీఎంకే	132	98
టీఎంసీ	230	95
ఆప్	123	69
ఎస్పీ	110	68

తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు



నకిలీ ఓటర్లను గుర్తించేందుకు సాఫ్ట్‌వేర్‌లో కొత్త ఆప్షన్

ఎన్నికల కమిషన్ ప్రకటన

కోల్‌కతా, మార్చి 17: డూప్లికేట్ ఓటర్లపై ప్రతిపక్షాలు నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎట్టకేలకు చర్యలకు ఉపక్రమించింది. నకిలీ ఓటర్లను గుర్తించేందుకు సాఫ్ట్‌వేర్‌లో కొత్త ఆప్షన్ తీసుకువస్తున్నట్టు ఎన్నికల అధికారి ఒకరు సోమవారం వెల్లడించారు. ఒకే ఓటర్ ఐడీపై ఎక్కువ ఓటర్లు నమోదైతే ఈ కొత్త ఆప్షన్ ద్వారా ఈఆర్‌వోలు గుర్తించేందుకు వీలవుతుందని చెప్పారు. దీనిపైన అన్ని రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. డూప్లికేట్ ఎపిక్ నంబర్ల ఏరివేతకు సంబంధించి కొత్త మాడ్యూల్ గురించి తెలుపుతూ చీఫ్ ఎలక్టోరల్ అధికారులకు లేఖలు పంపినట్టు చెప్పారు.

పాక్‌లో చైనా కాల్ సెంటర్ లూటీ

ల్యాప్‌టాప్‌లు ఎత్తుకెళ్లిన స్థానికులు

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో ఈ నెల 15న ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీకి చెందిన సైబర్ క్రైమ్ సెల్ అధికారులు చైనీయులు నడుపుతున్న ఓ ఫేక్ కాల్ సెంటర్‌పై దాడి చేశారు. దీనిలో పాకిస్థానీలు, చైనీయులు సహా కొందరు విదేశీయులు పని చేస్తున్నట్లు గుర్తించారు. వీరు ఇంటర్నేషనల్ ఫ్రాడ్ బిజినెస్‌ను నిర్వహిస్తున్నారని దర్యాప్తులో వెల్లడైంది. దీంతో 24 మందిని అరెస్ట్ చేశారు. కొందరు అనుమానితులు తప్పించుకుపోయారు. అయితే, ఈ దాడుల సమయంలో భద్రతా సిబ్బంది తగిన సంఖ్యలో లేకపోవడంతో స్థానికులు రెచ్చిపోయారు. సామాజిక మాధ్యమాల్లో కనిపించిన వీడియోల ప్రకారం, చాలా మంది స్థానికులు ఈ కాల్ సెంటర్ భవనంలోకి చొరబడి, విలువైన ల్యాప్‌టాప్‌లు, టెక్నికల్ పరికరాలను దోచుకుపోయారు. ఇవన్నీ సాక్ష్యాధారాలుగా కోర్టులో సమర్పించవలసి ఉండగా, దోపిడీకి గురికావడంతో అధికారులు అవాక్కయ్యారు.

నాగ్‌పూర్‌లో 'ఔరంగజేబ్' మంటలు

- మొగల్ చక్రవర్తి సమాధిని తొలగించాలంటూ నిరసనలు
- అల్లర్లలో 25 మంది పోలీసులకు తీవ్రగాయాలు

నాగ్‌పూర్: మొఘలు చక్రవర్తి ఔరంగజేబ్ సమాధిని తొలగించాలన్న వివాదం మహారాష్ట్రను కుదిపేస్తున్నది. సమాధిని తొలగించాలంటూ సోమవారం నాగ్‌పూర్‌లో కొందరు చేపట్టిన నిరసన హింసాత్మక ఘర్షణలకు దారితీసింది. అల్లరి మూకలు పోలీసులపై రాళ్ల దాడులు చేశారు. వాహనాలను తగలబెట్టారు. ఘర్షణల్లో 25 మంది పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు టియర్‌గ్యాస్ ప్రయోగించారు. ఘర్షణల నేపథ్యంలో నగరంలో 144 సెక్షన్ విధించారు. పోలీసులు గస్తీ బృందాలను పెంచారు. వదంతులను నమ్మవద్దని ప్రజలను అధికారులు కోరారు. పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హై రిస్క్ జోన్స్‌లో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేసినట్లు తెలిపారు. ఘర్షణల నేపథ్యంలో పజలు ప్రశాంతంగా ఉండాలని సీఎం ఫడ్నవీస్, కేంద్ర మంత్రి గడ్కరీ కోరారు. వివాదం నేపథ్యంలో ఔరంగజేబ్ సమాధికి మహారాష్ట్ర ప్రభుత్వం భద్రతను పెంచింది.

సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ బాగ్చి ప్రమాణం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణం చేయించారు. జస్టిస్ బాగ్చి కలకత్తా హైకోర్టు సీనియర్ జడ్జిగా పని చేశారు. సుప్రీంకోర్టులో మొత్తం 34 మంది న్యాయమూర్తుల నియామకానికి అనుమతి ఉంది. ప్రస్తుతం జస్టిస్ బాగ్చితో కలిపి 33 మంది న్యాయమూర్తులు ఉన్నారు. ఆయన పదవీ కాలం ఆరు సంవత్సరాలకుపైగా ఉంది.

కోల్‌కతా మహిళకు హ్యూమన్ కరోనా వైరస్

కోల్‌కతా: కోల్‌కతాలోని ఓ మహిళ అత్యంత అరుదైన 'హ్యూమన్ కరోనా వైరస్' (హెచ్‌కేయూ1) బారినపడ్డారన్న సంగతి తాజాగా వెలుగులోకి వచ్చింది. కోల్‌కతాలో చికిత్స పొందుతున్న ఆమెను ఐసోలేషన్ ఉంచినట్టు వైద్యులు తెలిపారు. 45 ఏండ్ల మహిళ గత 15 రోజులుగా జలుబు, జ్వరం, దగ్గుతో బాధపడుతున్నారని, దక్షిణ కోల్‌కతాలోని ఓ ప్రైవేట్ దవాఖానలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని తెలిసింది. హెచ్‌కేయూ1 సాధారణంగా తేలికపాటి శ్వాసకోశ వ్యాధులతో ముడిపడి ఉంటుందని, ఇది మహమ్మారిగా మారే అవకాశం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. హెచ్‌కేయూ1..అనేది కరోనా వైరస్‌లోని 'బీటా కరోనా వైరస్ హాంకానెన్స్' రకానికి చెందినదని, ఈ వైరస్‌కు ప్రత్యేక చికిత్స,